క్లుప్తంగా

ముగిసిన బధిరుల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు



బధిరుల క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: బధిరులు అన్ని రంగాల్లోనూ రాణించాలని, వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని రాష్ట్ర మున్సిపల్ మినిస్టీరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ద డెఫ్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు డీఎన్నార్ కళాశాల గన్నాబత్తుల క్రీడామైదానంలో నిర్వహించిన 5వ రాష్ట్రస్థాయి టి20 క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. పోటీల్లో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జట్టు ప్రథమ స్థానం సాధించగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జట్టు ద్వితీయస్థానంలో నిలిచారని అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి తెలిపారు. అనంతరం విజేతలకు ట్రోఫీ, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ సభ్యులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

డీఏఎఫ్ సభ్యుడిగా సుబ్బయ్య


నియామక పత్రం అందుకుంటున్న సుబ్బయ్య

భీమవరం: కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ అనుబంధ సంస్థ (డీఏఎఫ్) భారత ప్రభుత్వం అఖిల భారత బోర్డు సభ్యుడిగా భీమవరం పట్టణానికి చెందిన గరికిముక్కు సుబ్బయ్య నియమితులయ్యారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన డీఏఎఫ్ జనరల్‌బాడీ సమావేశంలో సుబ్బయ్యకు కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ నియామక ఉత్వర్తులివ్వగా బోర్డు జనరల్ సెక్రటరీ ప్రభాత్ కుమార్ సింగ్ నియామక పత్రం అందజేశారు. సమావేశంలో ఎస్సీ కులాలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి కేంద్ర ప్రభుత్వం చర్చించినట్లు సుబ్బయ్య చెప్పారు. ఈ సందర్భంగా సుబ్బయ్యను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై సత్యకుమార్ అభినందించారు.

ఘనంగా సరోజినీనాయుడు జయంతి

ఆకివీడు: నేటి నారీ మణులకు స్వాతంత్ర్య సమర యోధురాలు, భారత తొలి మహిళా గవర్నర్ సరోజినీనాయుడు జీవితం ఆదర్శప్రాయమని విశ్రాంత హెచ్‌ఎం లయన్స్ ఆదర్శ క్లబ్ అధ్యక్షురాలు కాకర్ల రాజరాజేశ్వరి చెప్పారు. మండలంలోని దుంపగడప వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజేశ్వరి మాట్లాడుతూ సరోజినీనాయుడు సేవలను కొనియాడారు. భారత కోకిల బిరుదు పొందిన ఆమె జయంతిని ప్రభుత్వం మహిళా సాధికారిత జాతీయ దినోత్సవంగా నిర్వహించడం గర్వించదగిన విషయమన్నారు. ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ మహిళలు సాధికారత కోసం తీవ్రంగా పోరాడిన దిగ్గజ మహిళ అన్నారు. క్లబ్ కార్యదర్శి మోరా జ్యోతిరెడ్డి మాట్లాడుతూ సరోజినీనాయుడు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం అధ్యక్ష కార్యదర్శులు రాజేశ్వరి, జ్యోతిలను ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకులు సత్కరించారు.

దివ్యాంగుల భవితకు పునాది


చిన్నారులకు శిక్షణనిస్తున్న దృశ్యం


ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం

కాళ్ల: పుట్టుకతోనే మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పడుతున్న చిన్నారులను అక్కున చేర్చుకుని తల్లితండ్రులకు మేము ఉన్నామంటూ మనోధైర్యాన్ని నింపుతున్నారు భవిత కేంద్రాల్లోని ఐఈఆర్‌సీలు, ఆయాలు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల కోసం నియోజకవర్గంలో కాళ్ల మండలం కోపల్లె, ఆకివీడు, మండల కేంద్రమైన ఉండిలో, పాలకోడేరు మండలపరిధిలోని, కోరుకొల్లు గ్రామాల్లో భవిత కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లోఇద్దరు ఐఈఆర్‌సీలు, ఒక ఆయా పని చేస్తున్నారు. ఈ ఐఈఆర్పీ(ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ పర్సన్)లు సర్వేలు నిర్వహించి, ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తిస్తున్నారు. వారికి చక్కటి భవిష్యత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నారు. కాళ్ల మండలం కోపల్లె భవిత కేంద్రంలో 20 మంది, పాలకోడేరు భవిత కేంద్రంలో 20 మంది, ఉండిలో 20, ఆకివీడులో 21 మంది చిన్నారులకు భవిత కేంద్రాల్లో శిక్షణ ఇస్తున్నారు.

భవిత కేంద్రాల్లో విద్యాబోధనతో పాటు చికిత్స

ప్రత్యేక వైద్య సేవలు

భవిత కేంద్రాల ద్వారా విద్యార్థి దశలోనే మానసిక దివ్యాంగులకు విద్యాబుద్ధులు, ఫిజియోథెరపీ వైద్య సేవలను అందిస్తున్నారు. వారికి అవసరమైన పరికరాలు అందజేయడంతో పాటు వారి పనులు వారే స్వచ్ఛందంగా చేసుకునేలా తీర్చిదిద్దుతున్నారు. పిల్లల వయస్సుతో పాటు వారి పరిస్థితిని అంచనా వేసి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వీరికి స్పీచ్‌థెరపీ, ఫిజియోథెరపీ, చిన్నతనంలోనే వికలాంగత్వాన్ని గుర్తించి, తగిన కృత్యాలను, రోజువారీ కార్యక్రమాలను నేర్పిస్తారు. ఇలా వారంలో ఐదు రోజుల పాటు సేవలందించిన ఐఈఆర్పీలు పిల్లలు ఇంటి వద్దకు వెళ్లి తల్లిదండ్రుల సమక్షంలో ఫిజియోథెరపితో పాటు శిక్షణ ఇస్తారు. ఈ కేంద్రంలో ప్రతి మంగళవారం ఫిజియోథెరపీ డాక్టర్ ద్వారా వైద్యం చేయిస్తారు.

శిక్షణను తల్లిదండ్రులు కొనసాగించాలి



పిల్లలకు చేస్తున్న సేవ ఒక భాగ్యంగా భావిస్తున్నాం. పిల్లలకు తల్లిదండ్రులు కూడా ఫిజియోథెరపీ సేవలు ఇంటి వద్ద కొనసాగించాలి. అప్పుడే వారు త్వరితగతిన మెరుగవుతారు. అందుకు తల్లితండ్రులు తరచూ భవిత పాఠశాలలకు వచ్చి మేము ఇచ్చే సలహాలు సూచనలు పాటించాలి. – అలుగు సునీత

కోడ్ వర్తించదా.?

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా.. కూటమి నేతలకు మాత్రం అది వర్తించదు అన్నట్లుగా ఉంది అధికారుల తీరు. ఎన్నికల కోడ్ కారణంగా గ్రామాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగించాల్సి ఉంది. కానీ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది మాత్రం కొన్ని పార్టీల రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు మాత్రమే తొలగించి జనసేన, టీడీపీ నేతల ఫ్లెక్సీల జోలికి మాత్రం వెళ్లడం లేదు.

– భీమవరం అర్బన్



భీమవరం ముఖద్వారం వద్ద..


డీఎన్నార్ కళాశాల సమీపంలో..


బరువానిపేటలో కూటమి నాయకుల ఫ్లెక్సీ


గొల్లవానితిప్ప రోడ్డులో దేగాపురం వద్ద ఇలా

హ్యాకథాన్ పోటీలతో విద్యార్థి భవిష్యత్‌కు దోహదం

భీమవరం: సాంకేతిక విద్యా సంస్థల్లో హ్యాకథాన్ పోటీల్లో పాల్గొనడం విద్యార్థి భవిష్యత్‌కు ఎంతగానో దోహదపడుతుందని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు అన్నారు. కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న డెవాప్స్ వర్క్‌షాప్ గురువారం ముగింపు సందర్భంగా 24 గంటల హ్యాకథాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. బ్రెయినో విజన్ ఎంటర్‌ప్రెన్యూర్ వి సాయిపవన్ మాట్లాడుతూ విద్యార్థులు వినూత్న ఆలోచనలు భవిష్యత్తులో ఎన్నో విజయాలు సాధించేందుకు ఉపయోగపడతాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు, ఐటీ డిపార్ట్‌మెంట్ హెడ్ పి రవికిరణ్‌వర్మ మాట్లాడుతూ 150 మంది విద్యార్థులు పాల్గొన్న పోటీల్లో సుమారు 50 మంది విద్యార్థులు రాష్ట్రంలో వివిధ కళాశాలలకు చెందినవారున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ ఐ హేమలత, కె కిషోర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉమా మూలేశ్వరస్వామి ఆలయంలో అభివృద్ధి పనులు

వీరవాసరం: మండలంలోని రాయకుదురులో ఉమా మూలేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సుమారు రెండు లక్షల రూపాయల ఆర్థిక సహకారంతో వంట, హోమసాలను గురువారం దాతలు ప్రారంభించారు. శరణ్ సాయి హేచరీ అధినేత తోట వెంకటరమణ ఉషారాణి దంపతులు, కుటుంబ సభ్యుల సహకారంతో సుమారు రెండు లక్షల రూపాయలతో వంట, హోమశాలను నిర్మించారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలను గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో తోట విజయ్ కుమార్, అడ్డాల ఏడుకొండలు, ఎస్.సూర్య శేఖర్, ముచ్చర్ల సాయి, అడ్డాల రమేష్, తోట పెద్దబ్బులు, శంకరమంచి రఘురామ శర్మ, అడబాల చిన్నోడు , ఎస్.ప్రదీప్ ,నూతన ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్యాస్ సబ్సిడీలపై తనిఖీ

ఆకివీడు: ఉచిత గ్యాస్ పంపిణీలో భాగంగా లబ్ధిదారులకు సబ్సిడీ వారి ఖాతాల్లో పడుతుందో?లేదో? పరిశీలిస్తున్నట్లు తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు చెప్పారు. ప్రభుత్వం ఏటా మూడు ఉచిత సిలిండర్లను లబ్ధిదారులకు అందజేస్తుందని, వినియోగదారుడు ముందుగా గ్యాస్ సిలిండర్ ధరను చెల్లించాల్సి ఉందన్నారు. చెల్లించిన సొమ్ము వారి ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేస్తున్నట్లు చెప్పారు. ఆ విధంగా సబ్సిడీ పడని వారుంటే వారి వివరాల్ని సేకరించి, ఆన్‌లైన్‌లో లోపాల్ని సరిజేస్తామన్నారు. తొలుత డీలర్ వద్ద ఉచిత సిలిండర్లు పొందిన వారి వివరాలను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి గ్యాస్ పుస్తకం, ఆధార్, తదితర వాటిని పరిశీలించారు. తనిఖీల్లో ఆర్ఐ వంటపాటి ఆంజనేయులు పాల్గొన్నారు.

గూట్లపాడులో తాగునీరు వృథా


గూట్లపాడులో ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద నీరు వృథాగా పోతున్న దృశ్యం

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని గూట్లపాడు గ్రామంలో రక్షిత మంచినీటి చెరువు వద్ద ఓవర్ హెడ్ కింద పైపులైన్ ద్వారా తాగునీరు వృథా అవుతోంది. గ్రామంలో రోజురోజుకు ఎండలు ముదురుతుండటంతో తాగునీటిని నింపుతున్నారు. పంచాయతీ సిబ్బంది తాగునీటిని పైపులైన్ ద్వారా రోజుకు ఒకసారి మాత్రమే సరఫరా చేస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. వాటర్ ట్యాంక్ వద్ద నీరు వృథా కావడంతో శివారు ప్రాంతాలకు తాగునీరందక పోవడంతో పంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మోటారుసైకిళ్ల చోరీ కేసులో ఏడు నెలల జైలు

భీమవరం: మోటార్‌సైకిళ్ల చోరీ కేసులో ముద్దాయికి 7 నెలల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాలివి. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గతేడాది మోటారు సైకిళ్ల దొంగతనానికి పాల్పడిన బోను మోజేష్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా విచారణానంతరం నేరం రుజువు కావడంతో జడ్జి డి ధనరాజు 7 నెలల జైలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ సుజాత వాదనలు వినిపించగా వన్‌టౌన్ కానిస్టేబుల్ మురళీ సహకరించారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ఉండి: మండలంలోని కోలమూరు గ్రామంలో కోడిపందేల స్థావరంపై ఎస్సై ఎండీ నసీరుల్లా ఆధ్వర్యంలో గురువారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో కోడిపందేలు నిర్వహిస్తున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.40,200 నగదు, రెండు కోళ్లు, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నసీరుల్లా తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వీరవాసరం: మండలంలోని కొణితివాడ 33 బై 11 కెవీ సబ్‌స్టేషన్‌లో మెయింటెన్స్, చెట్టుకొమ్మలు తొలగించడానికి శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న ఏఈ అప్పారావు గురువారం తెలిపారు. కొణితివాడ, నవుడూరు, అండలూరు, మడుగు పోలవరం, నేలపోగుల, గవరవరం గ్రామాలకు ఇండస్ట్రియల్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తున్న దృశ్యం

భీమవరం: ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని అసిస్టెంట్ వెహికల్ ఇన్‌స్పెక్టర్స్ ఎ.తేజ, సత్యనారాయణ అన్నారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా గురువారం భీమవరం ఏఆర్‌కెఆర్ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు రోడ్ సేఫ్టీపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించడానికి రోడ్డు భద్రతా వారోత్సవాలను ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎ.సత్యనారాయణమూర్తి, నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే ప్రమాదాలుతప్పవన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

ఆకివీడు: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న పీడీఎఫ్ అభ్యర్థి దొడ్ల వీర రాఘవులును గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ పిలుపునిచ్చారు. స్థానిక స్టేట్ బ్యాంక్‌లో గురువారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన నిలిచే వ్యక్తి వీరరాఘవులు అన్నారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడుకునేందుకు మొదటి ప్రాధాన్యతా ఓటును వీరరాఘవులుకు వేసి గెలిపించాలని ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు తవిటినాయుడు, పెంకి అప్పారావు, సూరిబాబు, బీవీ వర్మ, డి.రవితేజ, సాకా కిసింజర్ పాల్గొన్నారు.


పౌల్ట్రీ యాజమాన్యాల రుణాలను రీ షెడ్యూల్ చేయాలి

భీమవరం: బర్డ్ ఫ్లూ కారణంగా నష్టపోయిన పౌల్ట్రీ యాజమాన్యాల రుణాలను రీ షెడ్యూల్ చేయడంతో పాటు బర్డ్‌ఫ్లూను అరికట్టే చర్యలు వేగవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు.ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ కోళ్ల పెంపకంపై ఆధారపడి పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలన్నారు. బర్డ్ ఫ్లూ కారణంగా జిల్లాలో పౌల్ట్రీ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయిందని దీనిపై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల కుటుంబాలను పోషించుకోలేక నానా అవస్థలు పడుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోళ్లు చనిపోయి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోకుండా అధికారులు మూడు నెలలపాటు కోళ్ల ఫారాలు మూసివేయాలనడంతో పౌల్ట్రీ రైతాంగం మరింత ఆందోళన చెందుతున్నారన్నారు. బర్డ్ ఫ్లూవల్ల చనిపోయిన కోళ్లను మురుగు, పంట కాలువల్లో వేయకుండా ఖననం చేసేలా చర్యలు చేపట్టాలని గోపాలన్ కోరారు.



మహాప్రసాదం.. వితరణకు సిద్ధం

- నేడు మావుళ్లమ్మ తల్లికి మహానైవేద్యం సమర్పణ
- అనంతరం లక్షమందికి అన్నసమారాధన
- ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు అన్నదానం
- గురువారం సాయంత్రం నుంచే వంటలు, భోజన ఏర్పాట్లు


మావుళ్లమ్మ

భీమవరం (ప్రకాశం చౌక్) : భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 61వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించనున్నారు. పట్టణంతో పాటు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చే సుమారు లక్ష మంది భక్తులకు అమ్మవారి అన్నప్రసాదాన్ని అందించేందుకు ఉత్సవాల నిర్వాహకులు నీరుల్లి కూరగాయ పండ్లు వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేశారు. అన్నదానం కోసం అవసరమైన కూరగాయలు, బియ్యం ఇతర వస్తువులను గురువారం ఉదయమే అమ్మవారి ఆలయం వద్దకు చేర్చి గురువారం సాయంత్రం నుంచే వంటలను తయారు చేయడం ప్రారంభించారు. శుక్రవారం ఉదయం భక్తులు ప్రత్యేక క్యూలైనుల్లో వచ్చి అమ్మవారి ప్రసాదం స్వీకరించి సంతృప్తి చెందేలా సర్వం సిద్ధం చేశారు.


వంటకు కూరగాయలను సిద్ధం చేస్తున్న మహిళలు

భోజనం మెనూ ఇలా

అమ్మవారి అన్నదాన ప్రసాదంలో చక్ర పొంగలి, పులిహోర, అన్నం, బంగాళదుంప కుర్మా, వంకాయ కర్రీ, ఆవకాయ పచ్చడి, సాంబారు, పెరుగు. వాటితో పాటు భక్తులు తీసుకువచ్చే పలు రకాల పిండి వంటలు, స్వీట్లు ఉంటాయి.

అమ్మకు మహానైవేద్యం

శ్రీమావుళ్లమ్మ అమ్మవారికి శుక్రవారం ఉదయం 7.30 గంటలకు ప్రత్యేక పూజల నడుమ మహా నైవేద్యం సమర్పిస్తారు. పలు రకాల పిండి వంటలు, స్వీట్లు, పులిహోర ఇతర ప్రత్యేక ప్రసాదాలతో అమ్మవారికి మహానైవేద్యం సమర్పిస్తారు. అనంతరం అన్నదాన ప్రసాదం వితరణ ప్రారంభిస్తారు. ఈ అన్నసమారాధన భీమవరం చుట్టుపక్కల ప్రాంతాల్లోని భక్తులు హాజరవుతారు.

పోలీసు బందోబస్తు

అమ్మవారి అన్నదాన ప్రసాదం స్వీకరించడానికి భారీగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భీమవరం డీఎస్పీ జయసూర్య పర్యవేక్షణలో 5గురు సీఐలు, 10 మంది ఎస్సైలు, 150 మంది పోలీసు సిబ్బంది సేవలు అందిస్తారు. భోజనం చేసే ప్రాంతాల వద్ద, జనం లోపలికి, బయటకు వెళ్లే మార్గాల వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.


నైవేద్యానికి పూలహారం సిద్ధం చేస్తున్న మహిళలు


అన్నప్రసాదం తయారు చేస్తున్న దృశ్యం

వైభవంగా రామలింగేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠ

ఆకివీడు: సిద్ధులు పర్యటించిన కొల్లేరు సరస్సు తీర గ్రామం సిద్ధాపురంలో మరో ప్రతిష్ఠాత్మకమైన రామలింగేశ్వరుడి ఆలయం వెలిసింది. బ్రహ్మసూత్రంతో లభించిన శివలింగానికి దాతల సహకారంతో ఆలయం నిర్మించారు. నూతన ఆలయంలో స్వామివార్ల ప్రతిష్ఠా కార్యక్రమం హోరెత్తిన శివనామ స్మరణ మధ్య పర్వత వర్ధినీ రామలింగేశ్వర స్వామి ప్రతిష్ఠ గురువారం మధ్యాహ్నం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం ముందు అశేష భక్త జనసందోహం మధ్య శివహోం, శివహోం అంటూ ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద నిర్వహిస్తున్న మహా హోమం పూర్ణాహుతి కార్యక్రమం ముగిసింది.


నూతనంగా ప్రతిష్ఠించిన రామలింగేశ్వరుడి విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు


అశేష జనసందోహం మధ్య ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

ఆలయాల నిర్మాణాన్ని కంచి కామకోటి పీఠాధిపతుల దివ్య ఆశీస్సులతో ప్రముఖ వాస్తు సిద్ధాంతులు సుబ్బయ్య స్థపతి, స్వామినాథన్ స్థపతి(శివ) కాంచీపురం పర్యవేక్షణలో నిర్మాణాన్ని చేపట్టారు. ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆలయ నిర్మాణకర్త భూపతిరాజు తిమ్మరాజు దంపతులు, అల్లూరి సోమరాజు దంపతుల సమక్షంలో నిర్వహించారు. అనంతరం భారీ అఖండ అన్నసమారాధన నిర్వహించారు.